ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 16 ఫిబ్రవరి 2025



తప్పని నిరీక్షణ



- కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపుతో స్థానిక ఎన్నికలు ఆలస్యం
- మే లేదా జూన్‌లో నిర్వహించే అవకాశం
- ప్రభుత్వం నుంచి సంకేతాలు
- పలువురు ఆశావహుల్లో నిరాశ

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో ఆశావహులు మరికొంత కాలం ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ తరగతులు తదితర పనులు పూర్తి చేశారు. అయితే మరోసారి కుల గుణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడంపై ప్రభుత్వం ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరికొంత కాలం వాయిదా పడతాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏడాదికిపైగా ప్రత్యేకాధికారుల పాలన

గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి యేడాది దాటింది. జిల్లాలో 214 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారి పదవీ కాలం గత యేడాది జూలై 3వ తేదీతో ముగిసింది.

జిల్లాలో 18 మంది జడ్పీటీసీ సభ్యులుండగా వారి పదవీ కాలం కూడా ఒక్క రోజు తేడాతో అంటే జూలై 4వ తేదీతో ముగిసింది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రభుత్వం ఎన్నికలను నిర్వహి స్తామని చెప్పడంతో జిల్లాలోని 380 పంచాయతీ లలో ఆశావహులు అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల స్థానాలకు సైతం ఎన్నికలను నిర్వహిస్తామని చెప్పడంతో జిల్లాలోని 18 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలతో పాటు కొత్తగా ఏర్పడ్డ ఎండపల్లి, బీమారం ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేసింది. జిల్లాలో 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో 18 మండల పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు మే లేదా జూన్ మాసాల్లో ఎన్నికలు జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈనెల చివరిలోగా బీసీ కుల గణన రీ సర్వే పూర్తి చేసి దానిని అసెంబ్లీలో ఆమోదించనున్నారు. ఆ తర్వాత పార్లమెంట్‌లో ఆమోదించడానికి పంపనున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇంకా మూడు నుంచి నాలుగు నెలల సమయం ఉండడంతో రిజర్వేషన్లు తమకు అనుకూలిస్తాయో లేదో అని పలువురు ఆశావహుల్లో ఆందోళన నెలకొంది.

కొత్తగా ఏర్పాటైన బీమారం, ఎండపల్లి మండలాల్లో కూడా ఈ సారి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మండల పరిషత్‌ల సంఖ్య 18 నుంచి 20కి చేరింది. గతంలో 214 ఎంపీటీసీ సభ్యుల స్థానా లుండగా ప్రస్తుతం వీటి సంఖ్యలో 227కు చేరింది. ఆయా పార్టీల నాయకులు బరిలో నిలిచేందుకు మండల, నియోజకవర్గ, జిల్లా నేతలను ప్రసన్నం

పెరిగిన పరిషత్ స్థానాలు

చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏ రిజర్వేషన్ అయితే ఎవరు పోటీ చేయాలనే విషయమై గ్రామాల్లో ఇప్పటికే నేతలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే నిర్వహించిన కుల గణనలో చాలా మంది పాల్గొన లేదని, వారికి మళ్లీ కుల గణన నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటిం చింది. ఈనెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కుల గణన నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రకటించారు. ఆన్‌లైన్ సర్వేతో పాటు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఎంపీడీవో కార్యాయాల్లో ప్రజాపాలన అధికారుల వద్ద కూడా నమోదు చేసుకునే విధంగా అవకాశం కల్పించారు.



బ్యారేజీని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

కల సాకారం

గోదావరి నదిపై పూర్తయిన సదర్‌మాట్ బ్యారేజ్ నిర్మాణం

18 వేల ఎకరాలకు సాగు నీరు

త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు

7

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఘనంగా సంత సేవాలాల్ మహారాజ్ జయంతి

8



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

-కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై ఉద్యోగులు, సిబ్బందికి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియపై ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్‌ను సజావుగా నిర్వహించాలన్నారు. ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందన్నారు. గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న ఓటర్లకు టోకెన్ నంబర్లు అందించి ఓటింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, మెట్‌పల్లి ఆర్‌డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ హన్మంత్ రావు, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధికారి హకీం పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కొడిమ్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ అన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులు, అనుమానితులు తప్పకుండా ప్రతి రోజు పాదరక్షలు ధరించాలని ఆయన సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో సందర్శించారు. ఈనెల 21న రాష్ట్ర కుష్ఠు నివారణ ప్రత్యేక బృందం మండలానికి వస్తున్న సందర్భంగా ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మండలంలో సస్పెక్టెడ్, రాగి వర్ణం, మొద్దుబారిన మచ్చలు ఉన్నవారు తప్పకుండా అవగాహన కార్యక్రమానికి రావాలని కోరారు. పాత కేసులను ఆయన పరిశీలించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్లు పరమేశ్వరీ, నరేష్, సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, అలివేలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దు'

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని విద్యాశాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని సిరికొండ, కథలాపూర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుతూ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన అమలు తీరును స్థానిక ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకిని శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్‌ఎం వనతడుపుల రవికుమార్ పాల్గొన్నారు.

రేపు బేస్ బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజ్ఞ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సబ్ జూనియర్స్ స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సోమవారం ఉదయం 10 గంటల్లోపు ఆధార్ కార్డు, క్రీడా దుస్తులతో హాజరు కావాలని కోరారు. క్రీడాకారులు 01-01-2010 నుండి 31-12-2012 మధ్యలో జన్మించినవారు అర్హులని జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ళ అమర్‌నాథ్ రెడ్డి, కొప్పుల గంగాధర్‌లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7306224589 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

యాదవులు ఐక్యతతో ముందుకు సాగాలి

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదవులు ఐక్యతతో ముందుకు సాగుతూ తమ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా యాదవ సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలంలోని అంబారిపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యాదవ జనాభా దామాషా ప్రకారం వారికి రావాల్సిన ప్రయోజనాల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి రాచర్ల రవి, యాదవ సంఘ సభ్యులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవో రాముకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఈవో రాముకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుక్కోవెల శ్యామ్ సుందర్, డాక్టర్ టి శ్రీనివాస్‌లు వినతిపత్రం అందించారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓ రామును కలిసి సమస్యలను విన్నవించారు. కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. గత వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల విధులు సీనియారిటీ ఆధారంగా కేటాయించాలని కోరారు. ఆరు నెలల లోపు రిటైర్మెంట్ అయ్యే వారికి, గర్భిణులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు వినతిపత్రం అందించారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



రాయికల్‌లో జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో చిరంజీవి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని ఒక జడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఎన్నికల ముసాయిదా తుది ఓటరు జాబితాను శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిక కోసం ఇప్పటికే కేంద్రాల వారీగా జాబితాను ఎన్నికల అధికారుల సూచనలతో సిద్ధం చేశామన్నారు. మండలంలో మొత్తం 36781 మంది ఓటర్లు ఉండగా 75 కేంద్రాలను గుర్తించామన్నారు. అధికారుల ఆదేశాలతో ఎన్నికల తుది ఓటరు జాబితాను ప్రదర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను రాయికల్ ఎంపీడీవో చిరంజీవి నోటీసు బోర్డుపై ప్రచురించారు. మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు, 77 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 39,464 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుషులు 18,579 మంది, స్త్రీలు 20,882 మంది, ఇతరులు ఒకరు ఉన్నారని పేర్కొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత



నియామక పత్రం ఇస్తున్న డీఈవో రాము

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2008లో ఎంపికై ఉద్యోగాలు పొందిన 40 మంది అభ్యర్థులకు జిల్లా విద్యాధికారి రాము శనివారం నియామక పత్రాలు అందజేశారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆమోదంతో అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిపి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొడిమ్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి చదువుటకు ఆసక్తి గల విద్యార్థులు, 7, 8, 9, 10వ తరగతులలో మిగులు సీట్లలో ప్రవేశం పొందటానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 125రూపాయలు, ఓసీ వారికి 200రూపాయలు దరఖాస్తు రుసుం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు మోడల్‌స్కూల్‌లో ప్రవేశం పొంది ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ సాలియానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డులో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ప్రత్యామ్నాయ సరఫరా చేపట్టి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు మరమ్మతులు చేయడం పట్ల ఆయన సిబ్బందిని అభినందించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏడీఈ, టౌన్-3 ఏఈ సిబ్బంది పాల్గొన్నారు.

హరినామ సంకీర్తన

బీర్‌పూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన బీర్‌పూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం దేవస్థానం వారి ఆధ్వర్యంలో అఖండ హరి నామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అఖండ హరినామ సంకీర్తన బృందం వారు శనివారం ఉదయం 10 గంటలనుండి ఆదివారం ఉదయం 10 గంటల వరకు సంకీర్తన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

'కుల గణన సర్వే మళ్లీ చేపట్టడం హర్షణీయం'

కోరుట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మరో మారు కుల గణన చేపట్టడం హర్షణీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షేర్ నర్సారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ నుండి 28వ తేదీ వరకు కులగణన వివరాలను సేకరిస్తున్న సర్వే బృందంకు అందించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణనకు వస్తున్న సర్వే బృందాలకు ప్రతి ఒక్కరు సహకారం అందించి వివరాలను అందించాలని సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

●ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలి ● గృహ నిర్మాణ శాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాల యంలో గృహ నిర్మాణ శాఖ, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈ, డీఈ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికీ 100 శాతం సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.5లక్షలు అందజేస్తుందన్నారు.

ప్రజాపాలన కింద దరఖాస్తులు స్వీకరించబడిన వాటిని ఇందిరమ్మ యాప్ ద్వారా చెక్ చేస్తారని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. అర్హులైన లబ్ధిదారులను ముందుగా గుర్తించి గ్రామసభల్లో ప్రకటిస్తారన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణం కలిగి ఉండాలని, ప్రతి లబ్ధిదారునికి ఈ విషయం చేరవేయాలని అన్నారు. సర్వే సమయంలో ఫొటో తీసి మార్క్ అవుట్ ఇవ్వాలన్నారు. దశలవారీగా లబ్ధిదారులకు చెల్లింపులు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీవో రఘువరణ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడు బొడ్డు నిఖిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రాగట్లపల్లికి చెందిన నూకల సాయివంశీ ఈ నెల 13న అనారోగ్యంతో బాధపడుతూ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. తన రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను పడకపై ఉంచి మూత్రశాలకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. దాంతో సాయివంశీ పెద్దనాన్న మందాటి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన యువకుడు నిఖిల్‌ను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. అతడిని విచారించగా సాయివంశీకి సంబంధించిన సెల్‌ఫోన్‌ను తానే దొంగిలించానని నిఖిల్ అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లి గ్రామ శివారులో గంజాయి అమ్మడానికి వచ్చిన పున్ని వేణు అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన వేణు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. గంజాయి అమ్మడం ద్వారా డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో శనివారం గంజాయి తీసుకొని ఇల్లంతకుంటకు వస్తుండగా అరెస్ట్ చేసినట్టు తెలిపారు. నిందితుడి వద్ద 600 గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రొండ్ల కిరణ్ రెడ్డి(38) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్థుల వివరాలు ప్రకారం.. కిరణ్‌రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి సిద్దిపేట నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. వాహనానికి అడ్డుగా అడవిపంది రావడంతో కిందపడి గాయాల పాలయ్యాడు. కిరణ్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల హారిక(30)హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పెగడపల్లి ఎస్సై సీహెచ్. రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13న హారిక వ్యక్తిగత కారణాలతో ఆమె 10ఏళ్ల కుమారుడు కృష్ణంత్, 8ఏళ్ల కూతురు మయాంతలక్ష్మి ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. చికిత్స కోసం హైదరాబాదుకు తరలించగా చికిత్స పొందుతూ హారిక మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు, కూతురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మల్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. జగిత్యాల మండలానికి చెందిన ఓ బాలిక(17) తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న బాలిక శనివారం వేకువజామున చూసే వరకు కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్గాంకు చెందిన యువకుడిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



కమెడియన్‌గా నటించాలని ఉంది

- విష్ణుగుప్త, జీహెచ్ఎస్, రాంనగర్

సీరియల్స్‌లో, సినిమాల్లో నటిస్తా... విలన్, కమెడియన్‌గా నటించాలని ఆసక్తిగా ఉంది. ప్రేమ, బాధ, దుఃఖం, కోపం, ధీరత్వం, అద్భుతం వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చారు.



స్టేజి ఫియర్ పోయింది..

- జి శశాంక్, ఎలగందుల మోడల్ హైస్కూల్

అమ్మ ప్రోత్సాహంతో నటనలో శిక్షణ పొందాను. స్టేజ్ ఫియర్ పోయింది. హీరోగా పాత్రలు ధరించాలని ఉంది. శిక్షణ బాగా అనిపించింది.

‘రోల్ ప్లే’లో చిన్నారుల ప్రతిభ

కలెక్టర్ సహకారంతో నటనలో శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

● చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్‌లో ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కళ అందరిలో దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసే సందర్భాలు, ప్రోత్సాహం, శిక్షణ ఉంటే ఆయా కళలు బహిర్గతమవుతాయి. కలెక్టర్ పమేలా సత్పతి సూచనలతో కరీంనగర్‌కు చెందిన మోడ్రన్ యాక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ (మాస్క్) చైర్మన్ అనసూరి భూనాథాచారి ఆధ్వర్యంలో 45 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోల్ ప్లే విభాగంలో శిక్షణ పొందారు. ఈ మేరకు శనివారం కళాభారతిలో జరిగిన చిల్డ్రన్ థియేటర్ ఫెస్టివల్‌లో చిన్నారులు నేర్చుకున్న నటనను ప్రదర్శించి అందరినీ అబ్బుర పరిచారు.

● అలరించిన ప్రదర్శనలు

కరీంనగర్ కళాభారతిలో చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్-2025 శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై చిన్నారుల ప్రదర్శనను తిలకించారు. అద్భుత నటనతో ఆకట్టుకున్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మాస్క్ చైర్మన్ అనసూరి భూనాథాచారి, సీకేటీ అధ్యక్ష కార్యదర్శులు తిప్పర్తి ప్రభు, మంచాల రమేశ్, తిప్పర్తి రమేశ్, జి కృపాదానం, గోపాల్‌రావు, గాజుల రవీందర్, నాంపెల్లి శ్రీనివాస్, ఎంఏ మతీన్, అయిలు రమేశ్, మాడిశెట్టి గోపాల్, చకిలం స్వప్న, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



బాలికల రోల్ ప్లే ప్రదర్శన



కళాభారతిలో చిన్నారుల రోల్ ప్లే ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

మంచి స్పందన వచ్చింది

- అనసూరి భూనాథాచారి, మాస్క్ చైర్మన్



తొలుత కలెక్టర్ మేడం చెప్పాక భయమేసింది. పిల్లలు వస్తారో రారో అనుకున్న. రెండు మూడు రోజుల్లోనే విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రోత్సాహం, సహకారం అందించిన కలెక్టర్‌కు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.



పాఠశాల తరుపున ప్రోత్సాహం అందించారు

- జి దివ్య, జీహెచ్ఎస్ సప్తగిరికాలని

అనతికాలంలో శిక్షణనిచ్చిన మాస్క్‌కు కృతజ్ఞతలు. ఇంకా నటన నేర్చుకోవాలనుకుంటున్నాను. పాఠశాల తరఫున ప్రోత్సాహం అందించారు. మదర్ క్యారెక్టర్ అంటే ఇష్టం. సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్, సినిమాల్లో నటించాలని ఉంది.



ఏ ప్రాత అయినా చేస్తా..

- ఎస్ కావ్య (10వ) జీహెచ్ఎస్ సప్తగిరికాలని

ఇన్నాళ్లు మాలో దాగిన కళ బయటకొచ్చింది. ఏ పాత్ర అయినా చేసేస్తా. ఇదివరకంటే ఇప్పుడు ధైర్యం, యాక్టీవ్‌గా మాట్లాడుతున్నా. ఇంట్లో, స్కూల్లో, నా తోటి మిత్రుల ప్రోత్సాహంతో నటన నేర్చుకున్నా.

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆటో డ్రైవర్ బలి

● రూ.50 లక్షల వరకు అప్పు
● చెల్లించలేక ఆత్మహత్య



చొప్పరి దేవేందర్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ చొప్పరి దేవేందర్ (35) ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవేందర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. కొన్నేళ్లుగా ఆడుతూ సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడం, అప్పులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులతో శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దింపి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స చేసేందుకు నిరాకరించడంతో దేవేందర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దేవేందర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేవేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌కు చెందిన గడ్డం రాజచంద్రశేఖర్‌రెడ్డికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో వారిని, చుట్టు పక్కల వారిపై దాడులకు పాల్పడుతున్నాడు. దీంతో అతడి తండ్రి మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి రాజ చంద్రశేఖర్‌రెడ్డిని న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● ఎండుతున్న పంటలు ● ఆందోళనలో రైతులు



ఎండుతున్న వరిపంటను చూపుతున్న రైతులు

గంభీరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాఫానగర్ గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండుతున్నాయంటూ శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. లోవోల్టేజీ కారణంగా నెలలో రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలకు సాగునీటి ఇబ్బంది తలెత్తిందని వాపోయారు. చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలకు సాగునీరు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టి పంటలను కాపాడాలని కోరారు. ఈ ఆందోళనలో రైతులు దేవయ్య, రాజయ్య, భూమయ్య, రాములు, శ్రీనివాస్, శేఖర్, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలి

సిరిసిల్ల టౌన్ : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గంభీరావుపేట మండలం ముస్తాఫానగర్ గ్రామ రైతులు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. ముస్తాఫానగర్‌లో 100 కేవీ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై 130 కేవీ కెపాసిటీ భారం పడుతోందన్నారు. అనుమతి లేకుండా ఉన్న కనెక్షన్లు తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సెస్ అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రైతులు ఎండీ అక్బర్ ఖాన్, శివంది దేవయ్య, దోమకొండ భూమయ్య, కంటె దేవయ్య, దోమకొండ దేవయ్య, శివంది శ్రీనివాస్, బోదాస్ లక్ష్మయ్య, శివుని రాములు, శివంది కిషన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ ఇందిరాపార్కులో శనివారం కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీ గ్రామంలో రోడ్డుపై ఆడుకుంటున్న ఓగులాపూర్ గ్రామానికి చెందిన చెల్ల శ్రీవర్ధన్(2)పై కుక్కలు దాడి చేశాయి. అడ్డుకునేందుకు వెళ్లిన ఆకుబత్తిని రుక్కుంబాయి, అనురాధ, గౌడ సాన్విలతో పాటు మరికొందరిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వీరిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో పోలీసుస్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామ కారోబార్ బొల్లం శ్రీనివాస్‌ను, హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

కరెంట్ మోటార్ల దొంగల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కరెంటు మోటార్లు

మెట్‌పల్లి టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శనివారం పోలీస్‌లు పట్టుకున్నారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో, వ్యవసాయ మోటార్లు అధిక సంఖ్యలో దొంగతనాలు జరుగుతున్నాయని నిందితులను పట్టుకునేందుకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఎస్సై అనిల్ వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కుంచెపు వెంకటేష్, నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని ఎఆర్‌పి క్యాంపునకు చెందిన సూర్యవంశీ సాయికుమార్ ప్రస్తుతం రాఘవపేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్, మెట్‌పల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ బారి ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో దొంగతనాలు చేసినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి 6 లక్షల విలువ గల 1 మోటార్ సైకిల్, 30 కిలోల రాగి వైరు, 30 వ్యవసాయ కరెంట్ మోటార్లు 5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో కేసు ఛేదించిన మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ ఎస్ఐలు అనిల్, కిరణ్, రాజు, సిబ్బంది చైతన్య, కిరణ్, అనిల్, సాధునాయక్, మారుతిలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు

కూరగాయల సేద్యంతో అదనపు ఆదాయం పొందుతున్న రైతు గోపాల్



సాగు చేసిన కూరగాయాల తోట

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అతడో సాధారణ రైతు.. సంప్రదాయ పద్ధతిలో ఏటా వరి సాగుతో నష్టాలను చవిచూశాడు. దీంతో ఎలాగైన కష్టాల నుంచి గట్టెక్కాలని భావించాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు పండించాలని నిర్ణయించుకున్నాడు. తనకున్న ఆరు గుంటల్లో 12 రకాల పంటలను వేశాడు. పెట్టుబడి పోను గత ఆరునెలల్లో రూ.30 వేల వరకు ఆదాయం సమకూరిందని హర్షం వ్యక్త చేస్తున్నాడు ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్.

● వేర్వేరు పంటల సాగు.

మండల కేంద్రానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్ గ్రామ శివారులో తనకున్న 11 గుంటల్లో వరి పంటను సాగు చేసినా దిగుబడి అంతంత మాత్రమే రావడంతో ఆలోచనలో పడ్డాడు. కుటుంబ పోషణ భారంగా మారినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేసినా ఫలితం లేకుండాపోయింది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే కూరగాయల పంటల సాగును ఐదేళ్ల క్రితం ప్రారంభించాడు. 1.11 ఎకరాల భూమిలో 1.05 ఎకరాల్లో వరి పంటను, మిగిలిన 6 గుంటల్లో 12 రకాల కూరగాయల పంటలను సాగు చేశాడు. గుంట విస్తీర్ణంలో మిరప, మరో గుంటలో బెండ, మిగతా భూమిలో అర గుంట చొప్పున నాలుగు గుంటల్లో టమాట, బీర, కాకర, వంకాయ, గోరుచిక్కుడు, అల్చింత, పాలకూర, మెంతి, కొత్తిమీరతో పాటు ఒడ్డుకు రెండు వైపులా సోరకాయ పంటలను పండిస్తున్నాడు. 12 రకాల పంటలకు గాను దున్నడం, విత్తనాల ఖర్చులకు రూ.10 వేల వరకు వెచ్చించాడు. రెండు రోజులకొకసారి తడులు పెడుతున్నాడు. పండిన కూరగాయలను తెంపి మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో జరిగే బుధ, శుక్ర, శనివారాల్లోని వార సంతల్లో విక్రయిస్తున్నాడు. పంట పెట్టుబడి పోను ఆరు నెలల్లో రూ.30 వేల ఆదాయం సమకూరిందని రైతు గోపాల్ పేర్కొంటున్నాడు. ఒకే రకమైన పంటల సాగుతో కాకుండా వేర్వేరు రకాల పంటలను పండించడంతో నష్టాల నుంచి గట్టెక్కవచ్చునని గోపాల్ చెబుతున్నాడు.



కోతుల బెడదకు తోట చుట్టూ ఏర్పాటు చేసిన వల

అదనపు ఆదాయం పొందుతున్నా..

- అంతెర్పుల గోపాల్, రైతు

నాకున్న 11 గుంటల్లో మొదట వరి వేసేవాడిని. లాభం లేకుండాపోయింది. దాంతో పక్కనే ఉన్న ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాను. మొత్తం 1.11 ఎకరాల్లో 1.05 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను వేశాను. 6 గుంటల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నాను. కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు తోట చుట్టూ వలను ఏర్పాటు చేశాను. వరి సాగుతో పా టు కూరగాయలను పండించడం వల్ల నెలకు రూ. 5వేల వరకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

ఆర్టీవో అధికారులు వేధిస్తున్నారని నిరసన

● లారీ పైకి ఎక్కి విద్యుత్ తీగలు పట్టుకుంటానని బెదిరింపు



లారీ ఎక్కి నిరసన తెలుపుతున్న అనీల్‌గౌడ్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) ఆర్టీవో అధికారులు మాముళ్ళు వసూలు చేస్తున్నారని శనివారం బసంత్‌నగర్‌కు చెందిన ముత్యం అనీల్‌గౌడ్ అనే లారీ ఓనర్ నిరసన తెలిపాడు. లారీ పైకి ఎక్కి కరెంటు తీగలు పట్టుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆందోళన చేపట్టాడు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ తనపై కక్ష గట్టి ఆర్టీవో అధికారులు లారీలపై కేసులు రాసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. లారీ గతంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నప్పుడు అధికారులు ఆపి కేసు రాశారని, దానికి సంబంధించి జరిమానా శుక్రవారం చెల్లించానని, అదే రోజు మరో లారీకి ధ్రువపత్రాలు లేవని, మళ్లీ కేసు రాశారని వివరించారు. స్థానికులు, పోలీసులు నచ్చ జెప్పడంతో పైనుంచి కిందికి దిగాడు. అయితే జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావును వివరణ కోరగా ఏడున్నర నెలల క్రితం ఓవర్ లోడ్ కేసు నమోదైందని, దానికి సంబంధించి జరిమానా చెల్లించాడని, మరో లారీ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రవాణా అధికారులు మాముళ్ళకు పాల్పడితే కేసు నమోదు చేయరని, ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కోనరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారులోని మూలవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పర్మిషన్‌తో నడుస్తున్నప్పటికీ గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుకను ట్రాక్టర్లతో తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి నెలకొంటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇసుకను తరలించకుండా అడ్డుకున్నారు. వేరే ప్రాంతం నుంచి ఇసుకకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు.



కనగర్తిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

గీత కార్మికుడికి గాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన కరీంపేట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన గీతకార్మికుడు గుర్రం వీరస్వామి శనివారం సాయంత్రం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు గుజి ఊడిపోవడంతో పట్టు కోల్పోయి చెట్టుపై నుంచి జారుతూ మధ్యలో వచ్చి ఆగాడు. గమనించిన గీత కార్మికులు వీరస్వామిని కిందకు దింపారు. ఈ ప్రమాదంలో వీరస్వామి దంతాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న భారత్



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్‌జి

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నదని సామాజిక, సమరత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానం, ఆలోచనలతో వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నదన్నారు. దేశం ఆర్థికంగా పురోగతి సాధించాలంటే స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. జపాన్ దేశం అణుబాంబును ఎదుర్కొని అణతి కాలంలోనే ఆర్థికంగా ఎదిగి అమెరికాతో పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. భారతదేశం 75 సంవత్సరాల తర్వాత ఆర్థికంగా అభివృద్ధి సాధించి 102 దేశాలకు అన్నపెడుతుందన్నారు. 168 ఆర్థిక ర్యాంకింగ్‌లో ఉన్న దేశం నేడు 5వ స్థానంతో దూసుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ ముక్క హరీష్‌బాబు, కో-కన్వీనర్ కళ్లెం వాసుదేవరెడ్డి, వసంత్ వ్యాలీ కరస్పాండెంట్ ఇనుకొండ బుచ్చిరెడ్డి, సప్తగిరి హైస్కూల్ ఛైర్మన్ నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్టార్టప్ కంపెనీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులందరూ స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులను, సేవలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీ నారాయణ్ భట్ అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వారి ఆధ్వర్యంలో అగ్‌మార్క్ అగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సహ పరిశోధన స్థానం సంచాలకుల ఇంచార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్ అందించే సేవలను అందిపుచ్చుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్త రజినీదేవి మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు స్టార్టప్ సేవలను ఉపయోగించుకునేందుకు, గ్రామ ఆవిష్కరణలకు స్టాక్ అందించే విషయాన్ని వివరించారు. అనంతరం వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. తదనంతరం స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులైన రోబోట్స్, డ్రోన్స్‌ని క్షేత్రప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లోని 11 మంది రైతు ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యులు, సీఈవోలు, రైతులు, స్వశక్తి సంఘాల మహిళలతో పాటు అగ్రిహబ్ సీఈవో విజయ్, నాబార్డు కరీంనగర్ ఏజీఎం జయప్రకాశ్, ఇన్నోవేషన్ స్టాక్ రూరల్ స్టాక్ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, అగ్రిహబ్ మేనేజర్ ముఖేష్ పాల్గొన్నారు.

కల సాకారం

గోదావరి నదిపై పూర్తయిన సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం

- 18 వేల ఎకరాలకు సాగునీరు
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు



సదర్‌మాట్ బ్యారేజీ

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పూర్తి కావడంతో అన్నదాతల కల నెరవేరి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం 2017 జనవరిలో ప్రారంభించగా ఎట్టకేలకు 2024లో పనులు పూర్తి అయ్యాయి. దీంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో 18 వేల ఎకరాల పంట భూములు సస్యశ్యామలం కానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.554.28 కోట్ల నిధులు వెచ్చించి బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. పనులు గతేడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు రావడంతో పాటు, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆలస్యం అవుతూ వచ్చాయి. బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలలోని 500 మందికుపైగా రైతులకు చెందిన సుమారు 1230 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, నిర్మల్ జిల్లా మామడ మండలం కమల్‌కోట, పోన్కల్, టెంబుర్ని, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురికాగా బాధిత రైతులకు గత ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించింది.



బ్యారేజీపై నుంచి రహదారి

తీరనున్న సాగునీటి కష్టాలు

సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలో 18 వేల ఎకరాల పంట పొలాలు సస్యశ్యామలం కానున్నాయి. జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు, నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. సదర్మాట్ బ్యారేజీ కింద గతంలో వేములకుర్తి శివారులో నిర్మించిన గంగానాల ప్రాజెక్టును నింపి అక్కడి నుంచి వివిధ గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. గతంలో వేసవిలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడేవారు. బ్యారేజీ నిర్మాణంతో జిల్లాలోని వేములకుర్తి, యామపూర్, ఫకీర్ కొండపూర్‌తో పాటు మల్లాపూర్ మండలం నడికుడ, మొగిలిపేట, ఒబులపూర్ గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు ఓపెన్ చేయడంతో చివరి ఆయకట్టు వరకు రైతులు సాగు చేయడంతో ఆ ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడుతుంది. సదర్మాట్ బ్యారేజీ పొడవు కిలోమీటర్ ఉండగా బ్యారేజీపై సుమారు 7.5 మీటర్ల వెడల్పుతో వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బ్యారేజీకి 55 గేట్లు బిగించారు. నిర్మాణం పూర్తి కావడంతో బ్యారేజీకి జలకళ సంతరించుకుంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం

జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఈనెల చివరి నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు యోచిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మార్చి మొదటి లేదా రెండో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందన్న అభిప్రాయాలను సంబంధిత వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం కలగనుంది. ప్రాజెక్ట్ నిర్మాణంతో ఇప్పటికే అక్కడ పర్యాటక శోభ సంతరించుకుంది. నిత్యం రెండు జిల్లాలకు చెందిన పర్యాటకులు ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. ప్రభుత్వం చొరవ చూపి అక్కడ పార్క్, హోటల్స్, బోటింగ్‌తో పాటు వివిధ సౌకర్యాలు కల్పించి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులు, పట్టభద్రులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అల్గునూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల దశదిశ పేరిట నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎన్నో మంచి పనులు చేసిందని, రెండు లక్షల రుణమాఫీ 90శాతం మందికి వర్తింపజేసిందని అన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో 2 లక్షల రుణమాఫీ పొందని 10శాతం మందితో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడే పట్టభద్రులు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించుకోవాలని అన్నారు. ఓ అభ్యర్థి దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నాడని, పట్టభద్రులు, మేధావులు ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అద్భుతమైన పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. తనను గెలిపిస్తే విద్యారంగ అభివృద్ధికి, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడన్నారు. కులగణన ఓ బోగస్ ప్రక్రియ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సామాజికవర్గం గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన ఓ బోగస్ ప్రక్రియ అని హిందూ, ముస్లిం, బీసీ ముస్లిం అని ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. సర్వే లెక్కలు బోగస్ అనితేలడంతో మళ్లీ సర్వేకు అవకాశం ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ మేయర్లు డి శంకర్, వై సునీల్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సిరిసిల్లలో హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై శనివారం బయల్దేరి వెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్ పోటీలకు ఇంగ్లీష్ యూనియన్ పాఠశాలకు చెందిన వర్షిత్, ప్రహర్షిత్, గుణభద్రులు ఎంపిక కాగా, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రాజశేఖర్, కోచ్ ప్రేమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడకు అదనపు బస్సులు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. రాజు



భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వేములవాడకు 778 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ రీజియన్‌లలోని వివిధ డిపోల నుంచి అదనపు బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు 443 బస్సులు, కట్టకింద బస్‌స్టేషన్‌కు 335 బస్సులు నడిపించేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. వేములవాడతో పాటు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలతో పాటు, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం శైవక్షేత్రానికి అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు.

- **కాళేశ్వరం** క్షేత్రానికి మంథని డిపో నుంచి మంథని-కాళేశ్వరానికి 26 బస్సులు నడిపిస్తున్నామన్నారు. భక్తుల రద్దీని బట్టి గోదావరిఖని, కరీంనగర్ నుండి అదనపు బస్సులు నడిపిస్తామన్నారు. వేలాల క్షేత్రానికి గోదావరిఖని డిపో నుండి గోదావరిఖని-వేలాలకు 56 బస్సులు, మంథని డిపో నుంచి మంథని-వేలాలకు 40 బస్సులు నడిపిస్తున్నామన్నారు. అదే విధంగా దుబ్బరాజన్న క్షేత్రానికి జగిత్యాల డిపో నుంచి జగిత్యాల-దుబ్బ రాజన్న రూట్‌లో 50 బస్సులు అదనంగా నడిపిస్తున్నామన్నారు. పొట్లపల్లి క్షేత్రానికి హుస్నాబాద్ డిపో నుంచి హుస్నాబాద్- పొట్లపల్లికి 23 అదనపు బస్సులు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

వేములవాడ బస్‌స్టేషన్ నుంచి ఉచిత బస్సు

మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వేములవాడ ఆధ్వర్యంలో 14 మినీ బస్సులు వేములవాడ బస్‌స్టేషన్(తిప్పాపూర్) నుంచి వేములవాడ దేవాలయం వరకు ఉచిత ప్రయాణ సేవలు అందిస్తాయన్నారు. భక్తులు వేములవాడ బస్‌స్టేషన్ నుంచి దేవాలయం వరకు తిరుగు ప్రయాణంలో దేవాలయం నుంచి బస్‌స్టేషన్ వరకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. భక్తులు వేములవాడ క్షేత్రానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న బస్సు సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవాలన్నారు.

● వేములవాడ (తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
కరీంనగర్-1	కరీంనగర్-వేములవాడ	51
కరీంనగర్-2	కరీంనగర్-వేములవాడ	30
కోరుట్ల	కోరుట్ల-వేములవాడ	62
మెట్‌పల్లి	మెట్‌పల్లి-వేములవాడ	105
వేములవాడ	వేములవాడ-జెబిఎస్	84
వేములవాడ	వేములవాడ-కొండగట్టు జగిత్యాల	21
సిరిసిల్ల	వేములవాడ-వరంగల్	27
సిరిసిల్ల	సిరిసిల్ల-వేములవాడ	25
కరీంనగర్-1	వరంగల్-వేములవాడ	16
కరీంనగర్-2	వరంగల్-వేములవాడ	7
హుజూరాబాద్	వరంగల్-వేములవాడ	15

● వేములవాడ (కట్టకింద బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
నిర్మల్	నిర్మల్-వేములవాడ	83
ఆర్మూర్	ఆర్మూర్-వేములవాడ	100
నిజామాబాద్-1	నిజామాబాద్-వేములవాడ	17
కామారెడ్డి	కామారెడ్డి-వేములవాడ	33
నర్సంపేట్-	నర్సంపేట-మహబూబాబాద్ వేములవాడ	30
వరంగల్-1	వరంగల్-వేములవాడ	21
హన్మకొండ	వరంగల్-వేములవాడ	27
పరకాల	పరకాల-వేములవాడ	24

కేజ్ కల్చర్ ఏర్పాటుతో ముదిరాజ్‌లకు నష్టం



చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు వద్ద ముదిరాజ్ సంఘ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మిడ్‌మానేరు డ్యాంలో కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేస్తే ముదిరాజ్ కులస్థులకు తీరని అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆధారపడిన ముదిరాజ్ కులస్థులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు డ్యాంలో అక్వాహబ్ పేరుతో కేజీ కల్చర్‌ను ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని శనివారం జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు, మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసితులకు ఉపాధి కరువవుతుందని అన్నారు. అక్వా పేరిట తమ భూములను తీసుకుని మధ్యమానేరు డ్యాంలో కేజ్‌కల్చర్ ఏర్పాటు చేస్తున్నారని దీనిని ముదిరాజ్ కులస్థులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వారికి ఉన్న అనుమతులు ఏమిటో చూపించి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులకు ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా కేజ్ కల్చర్ కంపెనీలో పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయానికి పులిహోర ప్యాకింగ్ మిషన్ వితరణ

- గంటకు 2,100 ప్యాక్ చేసే సామర్థ్యం



పులిహోర ప్యాకింగ్ మిషన్

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రసాదాల పోటులో పులిహోర ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లికి చెందిన పీచర శ్రీహర్షరాజ్యలక్ష్మి అనే అంజన్న భక్తులు రూ.1.55లక్షలతో పులిహోర ప్యాకింగ్ మిషన్ కొనుగోలు చేసి దేవస్థానంకు కానుకగా అందించారు. శనివారం ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహర నాథ్, ప్రసాదాల ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మిషన్‌ను ప్రారంభించారు. పులిహోర ప్యాకింగ్ మిషన్ దేవస్థానం నిర్దేశిత 200గ్రాముల పులిహోరను గంటకు 2,100 ప్యాకెట్లు చేయనుందని అధికారులు తెలిపారు. దీంతో సిబ్బందికి పనిభారం తప్పడంతో పాటు రద్దీ రోజుల్లో మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



ధర్మపురి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడ్డారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు అంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వంశీకృష్ణ, విజయ్, నరసింహమూర్తి, నవీన్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రమేష్, తహసీల్దార్



● **ఆంధ్ర జ్యోతి:** శిఖం భూములు సాగు చేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

● **తహసీల్దార్:** శిఖం భూముల్లో సాగు చేసే వారి వివరాలను మోఖాపై పరిశీలిస్తున్నాం. వారందరిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండలంలో ఇప్పటి వరకు శిఖం భూములను ఆక్రమించిన వారి జాబితాలను సేకరించాం. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

● **ఆంధ్రజ్యోతి:** అక్రమంగా మట్టి తరలిస్తే ఏం చర్యలు తీసుకుంటున్నారు?

● **తహసీల్దార్:** ఇటీవల అనుమతి లేకుండా మట్టి తరలించిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి టిప్పర్లను సీజ్ చేశాం.

● **ఆంధ్రజ్యోతి:** అక్రమ లే అవుట్లపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

● **తహసీల్దార్:** అక్రమ లే అవుట్‌లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాటిని రద్దుచేయడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

-కొడిమ్యాల

బ్యాంక్ లింకేజీ లక్ష్యం 99 శాతం పూర్తి

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు బ్యాంక్ లింకేజీ ద్వారా నిర్ణయించిన లక్ష్యం 99 శాతం పూర్తి చేసినట్టు ఏపీఎం నరహరి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 41.74 కోట్ల లక్ష్యం కాగా రూ.40.90 కోట్ల మేర లక్ష్యం పూర్తి చేశామన్నారు. స్త్రీనిధి పథకం కింద రూ.5.31 కోట్ల లక్ష్యంకుగాను రూ.1.75 టార్గెట్ పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. 9 పాడి పశువుల యూనిట్లను మహిళలకు అందజేశామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

గొల్లపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం పురస్కరించుకుని వివిధ రంగాల్లో కృషి చేసిన వాళ్లకు తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఇచ్చే తెలుగు వెలుగు ఉగాది పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక తెలంగాణ కార్య నిర్వహణ కమిటీ కన్వీనర్ తుమ్మనపల్లి పూర్ణచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పూర్ణకుంభ పురస్కారం, ఉగాది మహానంది పురస్కారం, ఉగాది బుద్ధిపూర్ణిమ, ఉగాది నాట్య మయూరి, ఉగాది నటరాజ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుకు చివరి గడువు మార్చి 20 వరకు ఉందన్నారు. పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్, విశాఖ పట్నం కేంద్రాల్లో ఏప్రిల్ 13న జరుగుతుందన్నారు. వివరాలకు 9494400158, 9100174351 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

-చొప్పదండి ఎమ్మెల్యే సత్యం -ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



రాయికల్ మండలంలో జయంతి వేడుకల్లో పాల్గొన్న తండావాసులు



అల్లూరిసీతారామరాజుతండాలో భోగ్ బండార్‌న్ని తయారు చేస్తున్న గిరిజనులు

కొడిమ్యాల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం మండలంలోని గంగారాంతండా గ్రామంలో శనివారం నిర్వహించిన సంత్ సేవా లాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో కొడిమ్యాల సింగిల్‌విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు బోజ్యానాయక్, సుజాత, తండాల నాయకులు, కుల సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి

సారంగాపూర్: బంజరాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ధర్మానాయక్ తండాలో గల ఆలయంలో శనివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ కృషి చేశారన్నారు. ఆయన బోధనలను అందరూ ఆచరించాలని అన్నారు. సంత్ సేవాలాల్ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బంజారాలకు పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. జగిత్యాల నియోజక వర్గంలో ఏకలవ్య పాఠశాల మంజూరుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ నర్సింహరెడ్డి, మండల నాయకులు కోల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ నీల బంజారా కులసంఘ నాయకులు రవి నాయక్, తిరుపతి, గంగాధర్, దుబ్బానాయక్, శ్రీను, మ్యాకల శేఖర్, మల్లేశం, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళి

● మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం అల్లూరిసీతారామరాజుతండా గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గిరిజనులు భక్తి శ్రద్ధలతో నైవేద్యం తయారు చేశారు. అనంతరం వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ మహనీయుడు సేవాలాల్ మహారాజ్ బంజారాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

● **రాయికల్:** రాయికల్ మండలంలోని మంగ్త్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లోక్య నాయక్ తండాలో శనివారం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భూక్య అర్జున్ నాయక్, లావుడ్య, కేవుడ్య, దావు, అజ్మీర మంగ్యా నాయక్, సునావత్ బలరాం నాయక్, భూక్య శంకర్ నాయక్, మాలోతు రాజు నాయక్, అజ్మీర భూమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **పెగడపల్లి:** పెగడపల్లి మండలంలోని రాజారాంపల్లి ఏడు మోట్లపల్లి తండాలలో బంజారాలు సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిందర్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, ఇస్లావత్ రవి నాయక్, అజ్మీర అంజి నాయక్, తిరుపతి నాయక్, రాజేశ్ నాయక్, శేఖర్ నాయక్, కడారి తిరుపతి, చెట్ల కిషన్, తోట మల్లేశం, మిట్టపల్లి రాజెందర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మానాయక్ తండాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం



పోసానిపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని గ్రామసభలో ఎంపిక చేసిన లబ్ధిదారులతో శనివారం ఎంపీడీవో శంకర్‌నాయక్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇళ్లు నిర్మించుకునే వారు తమకు సమాచారం అందించి పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సులోచన, మాజీ సర్పంచ్ ఎంజీరెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

● రాయికల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ధర్మాజీపేట గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామసభలో మంజూరు పొందిన 147 మంది లబ్ధిదారులతో ఎంపీడీవో చిరంజీవి సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి చర్చించారు. అలాగే లబ్ధిదారులకు భూమి చదును చేసుకోవడానికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, ఏఈ పీఆర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా

ధర్మపురి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కోరారు. ధర్మపురిలో పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బ్రహ్మాండబేరి నరేష్ పాల్గొన్నారు.

● రాయికల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాయికల్ పట్టణంలోని వీఎస్ గార్డెన్‌లో పట్టభద్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రంగు మారిన రక్షిత మంచి నీరు

-ఇబ్బందులు పడుతున్న ప్రజలు -పట్టించుకోని అధికారులు



రంగు మారిన మిషన్ భగీరథ నీరు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రక్షిత మంచినీటి రంగు మారి రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం సాంకేతిక లోపంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడగా మరమ్మతులు చేపట్టారు. కానీ ప్రస్తుతం అధికారులు గుర్తించక పోవడంతో నీరు రంగు మారి సరఫరా అవుతున్నాయి. మండలంలోని కల్లూర్, సర్పరాజుపూర్, అయిలాపూర్, మాదాపూర్ గ్రామాల్లో నాలుగు రోజుల నుంచి రక్షిత మంచినీటి సరఫరాలో రంగు మారుతూ వస్తున్నాయి. నీరు బెల్లం రంగులో వస్తోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని నాణ్యమైన రక్షిత మంచినీటి సరఫరా చేయాలని మండల, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి అవసరమైన ప్రత్యేక కృషి చేస్తున్నానని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి అన్నారు. శనివారం పట్టణ శివారులో జిల్లా ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణం కొరకు అవసరమైన 26 గుంటల స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద కొనుగోలు చేసి ఒప్పంద పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మైలారపు లింబాద్రి మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సంఘ భవన నిర్మాణానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా స్థల సేకరణ పూర్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బుడికె శ్రీకాంత్, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పూటూరి నవీన్, మైలారపు రాంబాబు, సంఘ నాయకులు నూనె శ్రీనివాస్, పబ్బా శ్రీనివాస్, దువ్వ రాజు, చాడ చందు, కోట కిరణ్, పీఎంఆర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో సరోజినీనాయుడు జయంతి సందర్భంగా ఆంగ్ల భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల భాషా ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్విజ్ , రంగవల్లులు, డిజైనింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు హెచ్‌ఎం సంజీవ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు తహసీల్దార్ వినోద్ తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు 863, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం ఓటర్లు 23 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఈ మేరకు పీఓ, ఏపీఓ, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, నల్ల బిల్లు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్న పన్నుల వసూలు, ట్రేడ్ లైసెన్స్ రుసుంలను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 65 శాతం పన్నులు వసూలుయైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అక్షయ్, ప్రవీణ్, విజయ్, ముజిబ్, లక్ష్మణ్, నవీన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మోరపల్లి పాఠశాల సందర్శన

జగిత్యాలరూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను మోరపల్లి గ్రామానికి చెందిన ఎన్నారైలు బేతి గోపాల్‌రెడ్డి, గంగా, ఉదయ్ లు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పూర్వవిద్యార్థులుగా పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతామని అన్నారు. పాఠశాల పరిశుభ్రత పై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌మూర్తి, మానుపాటి బన్న, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

ధర్మపురి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి గురుకుల పాఠశాల విద్యార్థి బి. హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. మెట్‌పల్లిలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18, 19 వ తేదీల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో హర్షవర్ధన్ పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థి హర్షవర్ధన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ గోనె రమేష్, పీఈటీలు కల్పన, సంతోష్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు బెల్టులు పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని శివాజీనగర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం రామాజీపేట గ్రామానికి చెందిన పారిపెల్లి మురళి-శోభారాణి దంపతులు టై, బెల్టులు, ఐడీ కార్డులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు నవ్యశ్రీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి'

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఎమ్మెల్సీ బూత్ ఇంచార్జ్‌ల వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ జిల్లా ఇంచార్జ్ అయ్యన్నగారి భూమన్న, జిల్లా ప్రభారి రంజిత్, జిల్లా ఎమ్మెల్సీ కన్వీనర్ వడ్డేపల్లి శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ బోగ శ్రావణి, పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ పాల్గొన్నారు.

● కోరుట్ల: పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోమురయ్య గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి కొరారు. శనివారం పట్టణం బీజేపీ నాయకులతో ఎన్నికల సన్నాహక సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు పాల్గొన్నారు.

వీడీసీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి

కథలాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా కందారి కిషన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యక్షులుగా నీలి భూమయ్య, లోకిని గంగనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా ముంజ శంకర్‌గౌడ్, కోశాధికారిగా కొడిపల్లి రాజులను ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం తాము కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులను గ్రామస్థులు సన్మానించారు.

రెవెన్యూ గ్రామాల విభజన ఎప్పుడో?

-ఏళ్లు గడిచినా రెవెన్యూ పరిధిలేక పంచాయతీలకు నష్టం



మూటపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

రాయికల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడినా రెవెన్యూ గ్రామాల విభజనకు మోక్షం కలగడం లేదు. దీంతో ఇటు రైతులు, అటు గ్రామ పంచాయతీలకు ఆదాయం కొరవడింది. పేరుకే పంచాయతీలుగా ఉండి గతంలోని రెవెన్యూ గ్రామాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాలకు సీనరేజీ నిధులు రాకపోవడంతో పాటు ప్రత్యేకంగా రెవెన్యూ సేవలు అందడం లేదు. గ్రామాల మధ్య చెరువులు, వాగుల పంపకంలో గొడవలు తలెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీలుగా మారి ఏళ్ల గడిచినా రెవెన్యూ విభజన జరుగకపోవడంతో గ్రామాల్లో పూర్తిస్థాయి పాలన జరగడం లేదు.

● **మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు**

రాయికల్ మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా రెవెన్యూ గ్రామాలు 20 మాత్రమే ఉన్నాయి. దీంతో గతంలో పంచాయతీలుగా ఏర్పడిన జగన్నాథ్‌పూర్, రామారావుపల్లె, చెర్లకొండాపూర్, కొత్తపేట, రాజనగర్, సింగరావుపేట, అయోధ్య గ్రామాలు ఏర్పడి 30 ఏళ్ల గడిచినా నేటికీ రెవెన్యూ విభజన జరుగకపోవడంతో ఆయా గ్రామస్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూతో పాటు గ్రామంలో వనరుల పంపకం నిలిచిపోవడంతో పేరుకే పంచాయతీలుగా మారి ఇతర పనులకు గతంలోని గ్రామాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. అల్లీపూర్ రెవెన్యూ పరిధిలో అయోధ్య, సింగరావుపేట గ్రామాలు, మూటపెల్లి రెవెన్యూ పరిధిలో కొత్తపేట, బోర్నపెల్లి పరిధిలో జగన్నాథ్‌పూర్, ఇటిక్యాల పరిధిలో రామారావుపల్లె, ఆలూరు పరిధిలో రాజనగరం, మరియు రాయికల్ పరిధిలో చెర్లకొండాపూర్ గ్రామాలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో రెవెన్యూపరంగా భూముల క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరిగితే వచ్చే ఆదాయం రెవెన్యూ గ్రామాలకు వెళ్లడంతో పంచాయతీలకు ఆదాయం రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన మండలాలు ఏర్పడటంతో పాటు తండాలు పంచాయతీలుగా మార్చిన ప్రభుత్వం పంచాయతీలను రెవెన్యూ విభజన చేసి గ్రామాలకు రెవెన్యూ పాలన సౌలభ్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విభజన చేపట్టాలి

-జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, అయోధ్య



గ్రామం ఏర్పడిన నాటి నుంచి రెవెన్యూపరంగా విభజన జరుగకపోవడంతో గ్రామానికి ఆదాయం రావడం లేదు. స్థానికంగా సమస్యలు సరిష్కరించడం ఇబ్బందిగా మారింది. గత పదేళ్లుగా విభజన చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రెవెన్యూ విభజన చేయాలి.

గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

విజయ, మాజీ సర్పంచ్, జగన్నాథ్‌పూర్



పంచాయతీగా మారినా ఇప్పటికీ రెవెన్యూ గ్రామంగా మారకపోవడంతో మా గ్రామానికి సీనరేజీ నిధులు రావడం లేదు. నూతన జిల్లాలో రెవెన్యూపరంగా విభజన జరిగితే పాలనా పరంగా సౌలభ్యంతో పాటు వచ్చే ఆదాయంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. రైతులకు రెవెన్యూ సేవలు త్వరగా అందుతాయి.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారంకు చెందిన మాజీ ఎంపీపీ ఎడిపల్లి అశోక్ తల్లి సత్యవ్వ శుక్రవారం మృతి చెందగా మృతురాలి కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. అంతకు ముందు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. మాజీ జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, విండో ఛైర్మన్ సాగర్‌రావు, మాజీ సర్పంచ్‌లు బద్దం తిరుపతిరెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, మాజీ కోఆప్షన్ ఎం.డీ.అజర్, మల్లారెడ్డి, కోటేశ్వర్‌రావు, సురేందర్, రవివర్మ, దేవరాజం, మల్లారెడ్డి, శేఖర్, ప్రవీన్ ఆయన వెంట ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కోరుట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసిల్దార్ కిషన్ అన్నారు. శనివారం పట్టణంలోని సి.ప్రభాకర్ గ్రంథాలయంను సందర్శించి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతి యువతులతో మాట్లాడారు. వారు సిద్ధమవుతున్న పరీక్ష వివరాలను యువతి యువకులను తహసిల్దార్ కిషన్ అడిగి తెలుసుకున్నారు. గంథ్రాలయంలో ఉన్న పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం సందర్శనకు విచ్చేసిన తహసిల్దార్ కిషన్‌కు కమిటి సభ్యులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు రాస భూమయ్య, చెన్న విశ్వనాథం, తాళ్లపల్లి లక్ష్మణ్, రామిల్ల రాంబాబు, ఎన్నం రాధ, గోడికె రాజు, ఎండి మౌళన, పేట బాస్కర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

కోరుట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శనివారం మల్లన్న ఉత్సవ మూర్తుల శోభయాత్ర యాదవులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని అంజనేయ స్వామి దేవాలయంలో మల్లన్న ఉత్సవ మూర్తులకు యాదవ సంప్రదాయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి శోభయాత్రను జరిపారు. శోభయత్ర పట్టణంలోని అంజనేయ స్వామి దేవాలయం నుండి కల్లూర్ రోడ్డు మీదిగా మల్లన్న దేవలయంల వరకు సాగింది. ఈ సందర్భంగా డోలు కళాకారులు, పోతరాజులు నృత్యాలతో ఆ ప్రాంతం అలరింపజేసింది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రానికి చెందిన ఇరు కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి మృతి చెందగా కుటుంబ సభ్యులను, ముత్తన్నలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామమర్శించారు.

సింగిల్‌విండోల పదవీ కాలం పెంపు హర్షణీయం

కొడిమ్యాల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) : సింగిల్ విండోల పదవీ కాలం ఆరు నెలలు పెంచినందుకు శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని కొడిమ్యాల సింగిల్ విండో కార్యాలయంలో ఛైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు సన్మానం చేశారు.

నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.17.14 లక్షలు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత శనివారం స్వామి వారి హుండీ లెక్కింపును అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామి వారి హుండీలలో 17లక్షల 14 వేల 324 రూపాయలు నగదు భక్తుల నుండి ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. మిశ్రమ బంగారం 31గ్రాంలు, మిశ్రమ వెండి 7కిలోల 135 గ్రాంల ఈ హుండీ లెక్కింపులో ఆలయ ఇన్స్‌పెక్టర్ రాజమౌళి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్ కుమారాచార్యులు, శ్రీనాథాచార్యులు, సిబ్బంది రవి, కమలాకర్, కొమురయ్య, మహేందర్, రమేష్, కరీంనగర్ అన్నమయ్య సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.